కుంటలను తలపిస్తున్న రోడ్లు


కరీంపేటలో బురదమయంగా రోడ్డు


రోడ్డు మధ్యలో నీటి గుంత


తనుగుల బ్రిడ్జి వద్ద

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లన్ని బురద మయంగా తయారయ్యాయి. కరీంపేట నుంచి కొత్తకుంట, పిల్లకాలువ, ఇప్పలపల్లి, ఎగ్లాస్‌పూర్ తదితర పొలాల రోడ్లు బురద మయం కావడంతో పొలం వద్దకు వెళ్లే రైతులు, కూలీలు, మహిళలు వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు బురదరోడ్లపై మొరం పోయించాలని రైతులు కోరుతున్నారు.

జమ్మికుంట: మండలంలోని తనుగుల నుంచి ఓదెల మండలం గుంపులకు బ్రిడ్జి మీదుగా వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను తప్పించే ప్రయత్నంలో కిందిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాలని ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులను వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

'అంగన్‌వాడీ ఉద్యోగులపై చిన్నచూపు తగదు'

కరీంనగర్: అంగన్‌వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య, జిల్లా అధ్యక్షురాలు రజిత, ప్రధాన కార్యదర్శి డి.రజితలు ఒక సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ రోజు ఏమి ఇవ్వకుండా ఇంటికి పంపడం అన్యాయమన్నారు. జూన్ 1న 60ఏళ్లు నిండిన వారందరినీ తొలగించారని, 40 ఏళ్ల పాటు ఐసీడీఎస్‌లో సేవలు అందిస్తే ఉట్టి చేతులతో ఇంటికి పంపడం ఎంతవరకు సమంజసమని, ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తే ఉద్యోగి ఉద్యోగ విరమణ చేస్తే రావాల్సిన బకాయిలు ఇచ్చి పంపిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తూ జీవో విడుదల చేయాలన్నారు.

క్లుప్తంగా

పథకాల అమల్లో ఆదర్శం

వీణవంక: సంక్షేమ పథకాల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఎండీ సాహెబ్‌హుస్సేన్ అన్నారు. సోమవారం వీణవంకలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో కొన్నిటినీ ప్రభుత్వం అమలు చేయగా త్వరలో మిగితావాటిని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని పేర్కొన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొంటుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మయ్య


లక్ష్మయ్య

తిమ్మాపూర్: కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మొగిలిపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కల్లెపల్లి లక్ష్మయ్య నియామకమయ్యారు. ఈమేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్లుగా వడ్లూరి కృష్ణ, ప్రదీప్‌కుమార్, రాజు, కన్వీనర్లుగా కొత్తకొండ శంకర్, లింగంపల్లి శ్రీకాంత్, ఎండీ.నవాజ్, జాయింట్ కన్వీనర్లుగా తుమ్మ ప్రభాకర్, రాయికంటి కుమార్, ఇట్టు సజన్, బొడ్డు రాజు, ముఖ్య సలహాదారులుగా సింగిరెడ్డి లక్ష్మారెడ్డి లుక్కా రాజేశం, ఎస్.కిషన్‌ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ.. నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీశ్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి, శ్రావణ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నామని తహసీల్దార్ అనుపమ తెలిపారు. కార్యక్రమానికి మండల అధికారులు, అంబేద్కర్ సంఘం నాయకులు హాజరు కావాలని సూచించారు.

నియామకం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ కార్యదర్శిగా రజినీకాంత్


నియామక ఉత్తర్వులు అందిస్తున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ్

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన పిట్టల రజినీకాంత్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రజినీకాంత్‌కు నియామక ఉత్తర్వులను అందించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడారు. యువత సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ రవీందర్, నాయకులు బోయిని ప్రశాంత్, శీలం అజయ్, శివ పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి


మట్టిపోసిన ప్రాంతాన్ని చూయిస్తున్న గణేశ్

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా మిల్లు నిర్మాణానికి మట్టిపోశారని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణేశ్ ఆరోపించారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్నందున అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేవిధంగా వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా పోశారని, మట్టిని తరలించిన వ్యాపారులకు జరిమానా విధించాలన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌లో చేపట్టనున్న ఎస్‌డబ్ల్యూజీ పైప్‌లైన్ పనులకు సోమవారం కార్పొరేటర్ ఆకుల నర్మద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా డ్రైనేజీ లేకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల సమస్యలు దూరం చేసేందుకు ఎస్‌డబ్ల్యూజీ పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ యాదగిరి, ఆకుల నర్సయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు అంజిరెడ్డి, శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీనివాస్, రవి, తదితరులు

గన్నేరువరం: అర్హులైన రైతులందరికీ రూ.రెండు లక్షల మాఫీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామంలో సోమవారం రుణమాఫీ కాని రైతులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మొదటి దఫా రూ.లక్ష మాఫీ అర్హులైన చాలా మంది రైతులకు వర్తించలేదని, ప్రభుత్వ తప్పిదమా లేక అధికారుల నిర్లక్ష్యమో తెలియక రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, అర్హులైన రైతులను గుర్తించడంతో వ్యవసాయశాఖ అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. రుణమాఫీకి సంబంధించిన జాబితాను వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులైన రుణమాఫీ వర్తించని రైతులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మాఫీ చేయని పక్షంలో వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్టీ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీశైలం, యువజన నాయకులు ఆంజనేయులు, రైతులు శ్రీనివాస్, కూన రవి, పర్శరాములు, బుచ్చయ్య, కొమురయ్య, బాలయ్య పాల్గొన్నారు.

వీణవంక: అర్హులైన రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ వీణవంక మండల నాయకులు గొట్టిముక్కల రవీందర్‌రావు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో మాట్లాడారు. మొదటి విడత రుణమాఫీకి అర్హులైన చాలా మంది రైతులకు మాఫీ కాలేదని, అడ్డగోలు నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతుల్లో గందరగోళం సృష్టిస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిబంధనలను సడలించి రైతులకు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎండిపోయిన చెట్ల తొలగింపు



చొప్పదండి: పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని భూపాలపట్నం రోడ్డులో ఎండిన చెట్లను సోమవారం తొలగించారు. వర్షాలకు ఎండిన చెట్లు ఎప్పుడైనా పడిపోయే అవకాశం ఉందని, ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదం పొంచి ఉందని స్థానిక కౌన్సిలర్ చేపూరి హేమ స్పందించారు. మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ, కమిషనర్ కీర్తి నాగరాజు సహకారంతో ఎండిన చెట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎప్పుడు పడిపోతాయో తెలియని చెట్లను తొలగించడంతో భూపాలపట్నం, పెద్దాపూర్, వెదురుగట్ట, జూలపల్లి తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రమాదకరంగా చెట్లపై దృష్టి సారించామని కౌన్సిలర్ హేమ తెలిపారు.

రోడ్డుపై మట్టిపోయించిన యువకుడు


మట్టిని చదును చేస్తున్న ప్రశాంత్

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. రోడ్డుపై నడవలేని దుస్థితి నెలకొనడంతో గ్రామానికి చెందిన మద్దుల ప్రశాంత్ అనే యువకుడు సొంత ఖర్చుతో ఎనిమిది ట్రిప్పుల మొరం రోడ్డుపై పోయించాడు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ప్రశాంత్‌ని అభినందించారు.

ఈపీఎఫ్‌పై అవగాహన


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగశాఖ ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్ జిల్లా ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులకు సోమవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన సమావేశం కళాశాల డైరెక్టర్ కె. శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పీఎఫ్ జమ, తీసుకునే విధానం, ప్రయోజనాలు, పదవీ విరమణ రోజు ఫండ్ ఎలా పొందాలో వివరించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శంకరపట్నం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కేశవపట్నం బస్టాండ్‌లోని ప్రయాణికులకు సోమవారం హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రం అవగాహన కల్పించారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని, ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేస్తున్న నేపథ్యంలో బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతా నంబర్, పాన్‌కార్డు, ఆధార్‌నంబర్, ఓటీపీలు చెప్పాలంటూ మోసం చేసే అవకాశం ఉందని, ఇతరుకు వివరాలు తెలియజేసి మోసపోవద్దన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని సన్మార్గంలో నడవాలని సూచించారు.

చేనేత కార్మికులకు పని కల్పించాలి


రిలే నిరాహార దీక్షలో చిందం సునీత, చేనేత కార్మికులు

గంగాధర: పనుల్లేక పస్తులుంటున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం పని కల్పించాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్య నిర్వహణ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గర్శకుర్తి గ్రామంలో చేనేత కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజులుగా పని కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గతంలో బతుకమ్మ చీరల తయారీ ద్వారా కార్మికులకు కొంత ఉపాధి లభించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పని కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కార్మికుల అండతో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి


మాట్లాడుతున్న కిషోర్

ఇల్లందకుంట: కదిరే కృష్ణపై అక్రమ కేసును ఎత్తి వేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం సంస్కృతంలో వచ్చే సుప్రభాతాన్ని తెలుగులోకి అనువాదించి అర్థం చెబితే సుప్రభాతాన్ని కృష్ణ వక్రీకరించారని జూబ్లీహిల్స్‌పోలీస్ స్టేషనల్‌లో చీకోటి ప్రవీణ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారని, పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని తక్షణమే కృష్ణపై పెట్టిన అక్రమ కేసును ఎత్తి వేయాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సైదాపూర్: వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ పాల్గొన్నారు. చెక్కుల మంజూరుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేశారని పేర్కొన్నారు.

సామాజికవేత్తకు సన్మానం


వెంకటేన్ను సన్మానిస్తున్న చిరువ్యాపారులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త సబ్బని వెంకట్‌ను సోమవారం చిరువ్యాపారులు సన్మానించారు. పట్టణంలోని పాపరావు బొందలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో చిరువ్యాపారులకు ఉపాధి కోల్పోయారు. తన వంతుగా వెంకట్ ఆర్థికసాయం అందించిచినందుకు చిరువ్యాపారులు ఆయనను సన్మానించారు. మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు జితేందర్, బుచ్చయ్య, కొమురయ్య, సదానందం తదితరులు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపురి సంతోష్‌గౌడ్ తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సర్వాయిపాపన్న మోకు దెబ్బ గౌడసంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తోడేటి జితేందర్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడగోని బుచ్చయ్యగౌడ్, జిల్లా నాయకులు పల్లెర్ల కొమురయ్యగౌడ్, పెరుమాండ్ల సదానందంగౌడ్, రావుల విజయ్‌బాబు, మండల నాయకులు సోమవారం సంతోష్‌గౌడ్‌ను పరామర్శించారు. అనంతరం వైద్యఖర్చులు, కుటుంబ పోషణకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

'కేటీఆర్‌కు చట్టాలపై అవగాహన లేదు'

విద్యానగర్(కరీంనగర్): రెవెన్యూ చట్టాలపై కేటీఆర్‌కు అవగాహన లేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పెద్ద మోసంతో కూడుకుందని, కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగడంలో కుట్ర ఉందని కేటీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందని, సాదాబైనామాల క్రమబద్ధీకరణ అవకాశం ఇవ్వడం వల్ల 99శాతం సమస్యలు పరిష్కష్కారమైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ తెచ్చిన చట్టం వల్ల 22లక్షల ఎకరాల భూములు సమస్యాత్మకంగా మారాయన్నారు. కాంగ్రెస్ ధరణి సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చిందని ఈక్రమంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో చంద్రయ్య, శ్రీధర్, రామ్మూర్తి, రవీందర్, బాపురెడ్డి పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో సోమవారం ఓ గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కిందపడటంతో గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. వృత్తిలో భాగంగా చింత రమేష్(48) కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కిందపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అరుణ

రామడుగు: పత్తి పంటలో మంచి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించినప్పుడే మంచి దిగుబడి సాధించవచ్చని బీసీఐ ఫీల్డ్‌ఫెసిలిటేటర్ అరుణ సూచించారు. మండలంలోని వెలిచాల గ్రామంలో సోమవారం పత్తి పంటపై డబ్ల్యూడబ్ల్యూఎఫ్, నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు వావిలాకు కషాయం తయారీ విధానం, దానివల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు.

మృతుడి కుటుంబానికి అండగా స్నేహితులు


రాజు కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందిస్తున్న స్నేహితులు, టీచర్లు, తదితరులు

చొప్పదండి: బ్రెయిన్ ట్యూమర్‌తో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. చొప్పదండి పట్టణానికి చెందిన బుర్ర రాజు ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యానికి భార్య, పిల్లలు ఉన్నదంతా వెచ్చించినా కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పట్టణంలోని ప్రతిభ విద్యానికేతన్‌లో రాజుతో పాటు చదువుకున్న మిత్రులు రూ.1.32 లక్షల విరాళాలు సేకరించారు. పదో తరగతి విద్యార్థులు రూ.లక్షా నాలుగు వేలు, జూనియర్లు, ఉపాధ్యాయులు, ఇతర స్నేహితుల నుంచి రూ.28,300 సమకూర్చారు. సేకరించిన మొత్తాన్ని ఇద్దరు కుమార్తెల పేరుపై పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సోమవారం డిపాజిట్ పత్రాలను కుటుంబ సభ్యులకు అందించారు. పూర్వ విద్యార్థులు, టీచర్లు, స్నేహితులున్నారు.

'వెలిచాల'ను కలిసిన అర్బన్ బ్యాంక్ కమిటీ

కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల నూతనంగా నియమితులైన అర్బన్ బ్యాంక్ కమిటీ సభ్యులు సోమవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావును నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. బ్యాంక్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని రాజేందర్‌రావు హామీ ఇచ్చారు. వెలిచాలను కలిసిన వారిలో అర్బన్ బ్యాంక్ అసోసియేట్ చైర్మన్ విలాస్‌రెడ్డి, సభ్యులు మోహన్, భాస్కర్, విద్యాసాగర్, బ్యాంక్ సీఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విద్యానగర్: నగరంలోని న్యూ నవోదయ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 32 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి చిన్న నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఎ. కిరణ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, విజయ్, ఇంద్రసేనారెడ్డి, నరేందర్, ప్రదీప్, కృష్ణవేణి, సంతోష్‌రెడ్డి, లక్ష్మణాచారి, మల్లారెడ్డి, మనోహర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన ప్రథమ వార్షికోత్సవం


న్యూ నవోదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

కరీంనగర్: నగరంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించుకున్నారు. తీపి జ్ఞాపకాలను తిరిగి నెమరేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థులు ఆనందరాజు, సతీష్, నాగరాజు, రాజ్‌కుమార్, నవీన్ రాజు, నదిముద్దీన్, నైముద్దీన్, ఖలీల్, కుమారస్వామి నరహరి, శ్రీనివాస్, రామకృష్ణ ,సంపత్, మాధవి సునీత, సరిత, స్నేహలత, సురేష్, తదితరులు పాల్గొన్నారు.